ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 11 మార్చి 2024

ఎవరు..ఎక్కడ?

జనసేన-బీజేపీ మధ్య అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో ఎవరు..? ఎక్కడ పోటీ చేయాలనే దానిపై చర్చలు ఆరంభమయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో ఆయా స్థానాలకు ఇరు పార్టీలు అభ్యర్థులను ప్రకటించనుంది. ఇప్పటికే తెలుగుదేశం తాను పోటీ చేయదలచిన స్థానాలు కొన్నింటిని ప్రకటించింది. ఇక మిగిలిందల్లా పొత్తులో భాగంగా మిగతా స్థానాల్లో ఆయా సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇదంతా అన్ని పార్టీల్లోను టెన్షన్‌కు దారితీస్తోంది.

తుది దశలో ఉమ్మడి కసరత్తు

- టీడీపీ-బీజేపీ-జనసేన సీట్లపైనే అందరి దృష్టి
- తర్వాత అభ్యర్థుల ఖరారు దిశగా యత్నాలు
- ఇంకా చివరి ఆశలోనే ఆశావహులు
- రెండు రోజుల్లో తుది జాబితా విడుదల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఎన్నికల పొత్తులో భాగంగా ఇప్పటికే ప్రకటించిన స్థానాలు పోను మిగిలిన స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనకు వీలుగా కసరత్తు ఆరంభమైంది. సాధ్యమైనంత మేర ఒకేసారి జాబితాను ప్రకటించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకత్వాలు క్షణం తీరిక లేకుండా కసరత్తు చేస్తున్నాయి. అధికార వైసీపీని నేరుగా ఢీకొనడం, అంతే సామర్థ్యం కలిగిన అభ్యర్థులను రంగంలోకి దింపడం, మెజారిటీ స్థానాలను దక్కించుకోవడం వంటి ఉమ్మడి వ్యూహంతో అడుగులు కదుపుతున్నారు. ఆదివారం అమావాస్య కావడంతో కొన్ని కీలక నిర్ణయాలపై చర్చను సోమవారానికి వాయిదా వేశారు. జనసేన, బీజేపీ పక్షాల మధ్య అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలపై స్పష్టత వచ్చేందుకు వీలుగా బీజేపీ త్రిసభ్య కమిటీ విజయవాడ చేరుకుంది. వీరంతా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. వాస్తవానికి ఈ రెండు పార్టీలు అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను పరస్పరం అంగీకార కోణంలో సర్దుబాటుకు రావాల్సి ఉంది. నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాలను ఆది నుంచి బీజేపీ ఆశిస్తోంది. అయితే ఈ రెండింటిలో ఒక నియోజక వర్గాన్ని వదులుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏలూరు కేటాయిస్తే దీని నుంచి పోటీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి చాన్నాళ్ళ నుంచి పోటీకి వీలుగా అన్నీ సిద్ధం చేసుకున్నారు. తలవని తలంపుగా ఈ స్థానం నుంచి పోటీకి సుజనాచౌదరి పోటీ పడుతున్నారు. బీజేపీ అధినాయకత్వం నిర్ణయాన్ని బట్టి వీరిద్దరిలో ఎవరనేది తేలనుంది. ఇదంతా ఏలూరు సీటు బీజేపీకి కేటాయిస్తేనే. ఒకవేళ నరసాపురానికి కేటాయిస్తే ఆ స్థానం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, లేకుంటే సీనియర్ నేత బీసీ వర్గానికి చెందిన పాకా సత్యనారాయణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇదేస్థానం నుంచి ఒకరిద్దరి పేర్లు బయటకు వినపడుతున్నా బీజేపీ తుది పరిశీలనలోకి వచ్చిన పేర్లు మాత్రం ఈ రెండే కావడం విశేషం. ఉమ్మడి పశ్చిమలో ఒక లోక్‌సభ స్థానం, రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీకి బీజేపీ స్కెచ్ వేసింది. నర సాపురం లోక్‌సభ స్థానం పరిధిలో తమకు తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం అసెంబ్లీ స్థానాల్లో రెండింటిని కేటాయించాలని పట్టుపడుతోంది. అదే ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కైకలూరు స్థానాన్ని ఆది నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ తరుణంలో బీజేపీ ఉమ్మడి పశ్చిమలో తాము ఏ స్థానాల నుంచి పోటీ చేయదలచుకున్నాం, తమకు గెలుపు అవకాశాలు ఉన్న స్థానాలపై జనసేనాధిపతి పవన్‌తో చర్చకు సిద్ధమయ్యాయి. వాస్తవానికి జనసేన కేవలం అసెంబ్లీ స్థానాల్లోనే పోటీకి వీలుగా తన సైన్యాన్ని సిద్ధం చేసింది. నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల జోలికి జనసేన వెళ్ళలేదు. పోలవరం, ఉంగుటూరు, నిడదవోలు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం వంటి అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని మరీ ముందుకు వెళుతోంది. ఈ ఆరింటిలోనూ ఏ ఒక్క స్థానాన్ని వదులుకోవడానికి జనసేన సుముఖంగా లేదు. బీజేపీ మాత్రం ఉమ్మడి పశ్చిమలో ఒక లోక్‌సభ, రెండు అసెంబ్లీ స్థానాలను కోరుతోంది. ఈ నేపథ్యంలోనే ఇరు పార్టీల అగ్రనేతలు పరస్పర భేటీ కావడమే కాకుండా ఎవరు, ఎక్కడ పోటీ చేయాలనే దానిపై ఒక స్పష్టత తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

- గోదావరి జిల్లాల్లో ఫలితాలు వైసీపీయేతర పక్షాలకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయని, దీనిని బట్టి పొత్తులో భాగంగా కేటాయించిన సీట్లను సాధ్యమైనంత మేర పరస్పర అంగీకారంతో ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నాయి.
- తెలుగుదేశం ప్రకటించిన స్థానాల్లో చెయ్యి పెట్టకుండా మిగతా స్థానాలవైపే బీజేపీ-జనసేన పార్టీలు ప్రత్యేకంగా దృష్టి నిలిపాయి.

నూటికి నూరుపాళ్ళు పొత్తు విజయవంతం అయ్యిందనే సంకేతాలు ప్రజల ముంగిట కనిపించాలని, అందరినోట నానాలని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. దీనికితోడు తెలుగుదేశం ఒకటికి రెండుసార్లు సీట్ల ఖరారుపై ప్రత్యేకంగా లోతట్టుగా సర్వేలు చేసి ఆ మేరకు పూర్తి అనుకూలత వున్న నియోజకవర్గాలైన ఏలూరు, ఆచంట, తణుకు, పాలకొల్లు, ఉండి, చింతలపూడి నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎంపిక చేయడమే కాకుండా ప్రచారంలోనూ ముందు వరుసలో నిలిచేలా జాగ్రత్తపడ్డారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో మూడు రోజులు మిగిలి ఉండగా ఈలోగా తుది జాబితా ఉండాలని, మంగళవారంలోపు కసరత్తు పూర్తి చేయాలని ఉమ్మడిగా నిర్ణయించారు.

ఇప్పటికీ ఎన్నో ఆశలు

ఒకవైపు ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల ఖరారు, ఇంకో వైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగానే మరో వైపు ఆశావహులు పట్టు వీడకుండా తుది ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేకించి ఎంపీ స్థానాల్లో పోటీ పెద్దగా లేనప్పటికీ ఎమ్మెల్యే స్థానాలకు పోటీతత్వం ఎక్కువగానే కనిపిస్తోంది. బీజేపీ వ్యవహారం ఒక కొలిక్కి వస్తే సీట్ల విషయంలోనూ స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ త్రిసభ్య కమిటీ భేటీ అవడం, తదనుగుణంగానే రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఒకటి, రెండు రోజుల్లోనే తుది నిర్ణయానికి వస్తారని ఆదివారం వెల్లడించారు. టీడీపీ మాత్రం దెందులూరు స్థానం నుంచి అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్‌ను లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది.

పిలుపు రాకపోతే ఆమరణ దీక్ష

జనసేన అధిష్ఠానానికి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అల్టిమేటం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 10 : 'ఏలూరు అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు ఇవ్వలేదు. టీడీపీకి ఇచ్చిన విషయాన్ని నాకు చెప్పలేదు. ఈ నెల 14వ తేదీలోపు నన్ను అధిష్ఠానం పిలవకపోతే పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున ఆమరణ నిరాహార దీక్ష చేపడతాను' అని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏలూరు జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించకపోతే ఎలా అంటూ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట జనసేన నాయకులు బి.వి.రాఘవయ్యచౌదరి, సిరిపల్లి ప్రసాద్, సరిది రాజేష్, నగిరెడ్డి కాశీ నరేష్, కందుకూరి ఈశ్వరరావు, బొత్స మధు, వీరంకి పండు, తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచే రఘురామ

- పొత్తుల్లో భాగంగా నరసాపురం లోక్‌సభ స్థానం తెలుగుదేశానికి కేటాయింపు
- ఈ పార్టీ నుంచే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి
- త్వరలోనే పార్టీలో చేరిక..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణంరాజు తెలుగుదేశంలో చేరనున్నారు. ఆ పార్టీ తరపున కూటమి అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేలా ప్రణాళిక ఖాయమైంది. ఇప్పటికే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కూటమి అభ్యర్థిగా రంగంలోకి దిగేందుకు ఎప్పటి నుంచో సన్నాహాలు చేసుకున్నారు. ఏ పార్టీ తరపున పోటీ చేస్తారనే విషయమే తేలలేదు. తెలుగుదేశం-జనసేన కూటమితో బీజేపీతో పొత్తు కుదిరిన తర్వాత స్పష్టత వస్తుందని రఘురామరాజు ప్రకటించారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన తెలుగుదేశం - జనసేన ఉమ్మడి జెండా సభ వేదికపై నుంచే తన మనసులో మాట చెప్పారు. బీజేపీ తరపున లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే వైసీపీతోపాటు, కొన్ని అదృశ్య శక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారన్న ప్రచారం సాగింది. దీంతో నర్సాపురం లోక్‌సభ స్థానంపై ఒకింత సస్పెన్స్ ఏర్పడింది. టీడీపీ-జనసేన-బీజేపీల మధ్య పొత్తు కుదరడంతో లోక్‌సభ స్థానాల సర్దుబాటుపై తర్జన భర్జనపడ్డారు. బీజేపీ కూటమి తరపున ఆరు సీట్లు ఇచ్చేందుకు చంద్రబాబు, పవన్ అంగీకరించారు. నరసాపురం ఎంపీ స్థానాన్ని రఘురామకు కేటాయిస్తేనే దానిని బీజేపీకి ఇస్తామంటూ చంద్రబాబు ఆ పార్టీ అగ్ర నాయకత్వానికి స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదే విషయానికి జనసేన అధినేత కట్టుబడ్డారు. ఇద్దరు నేతల ఏకాభిప్రాయన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం వద్ద ఉంచారు. లేదంటే వేరే స్థానాన్ని తీసుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఏలూరు స్థానంపై బీజేపీ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ తరపున ఎంపీ అభ్యర్థిగా రఘురామ పోటీ చేయడం దాదాపు ఖాయమైంది. టీడీపీలోకి ఆయన రావడాన్ని పార్టీ నేతలు స్వాగతిస్తున్నారు. పొత్తులో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం జన సేనకు కేటాయిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక నేతలకు చంద్రబాబు నేరుగా వివరించారు. దీంతో ఎంపీ రఘురామ బీజేపీ తరపున పోటీ చేస్తే మూడు నియోజకవర్గాల్లో సైకిల్ గుర్తు లేకుండాపోతుంది. ఇప్పుడు టీడీపీ తరపున ఎంపీ రంగంలోకి దిగడంతో ప్రతి నియోజకవర్గంలోనూ సైకిల్ గుర్తు ఉంటుందంటూ టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలవరంలో టీడీపీ నిరసనలు

- టిక్కెట్ బొరగంకు ఇవ్వాలంటూ వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కొమ్ముగూడెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

బుట్టాయగూడెం/పోలవరం/వేలేరుపాడు/మార్చి 10: పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానాన్ని టీడీపీ ఇన్‌చార్జ్ బొరగం శ్రీనివాస్‌కే ఇవ్వాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెం సెంటరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. బొరగంకే టిక్కెట్ ఇవ్వాలని ఆండ్రూ శ్యామ్ కుమార్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పక్కనే వున్న నాయకులు, కార్యకర్తలు డబ్బా లాక్కుని సముదాయించారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తామని కాకపోతే గెలిచే అభ్యర్థికే సీటు ఇవ్వాలని చంద్రబాబును కోరారు. మడకం రామకృష్ణ, తెల్లం వెంకటేశ్వరావు, మొడియం బుజ్జి, జారం చాందినీ విద్యా సాగరిక, పూసం ముక్కమ్మ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభ్యర్థిత్వంపై టీడీపీ అధిష్ఠానం పునరాలోచన చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు కుంచే దొరబాబు కోరారు. బొరగం ఇంటి వద్ద ఆదివారం జరిగిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పాపోలు గణపతి రత్తయ్య, గుబ్బా రాంబాబు, పెద్దేహపు సత్యనారాయణ, జల్లేపల్లి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. పోలవరం స్థానాన్ని టీడీపీకి కేటాయించి, బొరగంకే టిక్కెట్టు ఇవ్వాలని వేలేరుపాడు మండల టీడీపీ కార్యవర్గం ఏకగ్రీవం గా తీర్మానించింది. పార్టీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యంత బలంగా ఉన్న టీడీపీకే కేటాయించాలని కోరారు. సంజీవులు, కొమ్మన వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, ముత్యాలరావు పాల్గొన్నారు.

పొత్తు ధర్మాన్ని పాటిస్తాం..



కొయ్యలగూడెం, మార్చి 10: పొత్తు ధర్మంలో సీటు ఎవరికి కేటాయించినా గెలిపిస్తామని టీడీపీ కొయ్యలగూడెం మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ అన్నారు. బయ్యన్నగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించినా జనసేనకు కేటాయించినా కష్టపడి పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఆ దిశగా పనిచేయాలని కోరారు. లెజెండ్, బాలం గంగాధరం, కటికి రాధాకృష్ణ పాల్గొన్నారు.

గన్ని అభ్యర్థిత్వం కోసం కార్యకర్తల పట్టు

భీమడోలు, మార్చి 10 : ఉంగుటూరు అసెంబ్లీ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు కేటాయించాలని కోరుతూ నియోజకవర్గం నుంచి 700 కార్లలో 3,000 మంది కార్యకర్తలు, నాయకులు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి ఆదివారం తరలివెళ్లారు. గుండుగొలను జంక్షన్‌కు చేరుకున్న పార్టీ శ్రేణులు కార్లలో ర్యాలీగా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉంగుటూరు సీటును గన్నికి కేటాయించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం పాదాల వద్ద వినతిపత్రాన్ని ఉంచి పార్టీ అధికార ప్రతినిధి పి.రమేష్‌కు అందజేశారు. అనంతరం పొలిట్‌బ్యూరో సభ్యుడు షరీఫ్‌కు నియోజకవర్గ పరిస్థితిని వివరించారు.



పొలిట్‌బ్యూరో సభ్యుడు షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

వైసీపీలోకి నేను రాను..

ఆ పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేసిన వలవల

చంద్రబాబుతోనే పయనమని వెల్లడి



భీమవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభ్యర్థి కోసం వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జిని తమ పార్టీలోకి తీసుకువెళ్లేందుకు రంగంలోకి దిగింది. పొత్తులో భాగంగా ఈ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంతో వైసీపీ కన్ను బాబ్జిపై పడింది. పార్టీలో చేరితే ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సహకారంతోపాటు టిక్కెట్ ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చింది. ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ కీలక నాయకుడు బాబ్జితో సంప్రదించారు. కాని వైసీపీ ఆఫర్‌ను బాబ్జి తిరస్కరించారు. చంద్రబాబు వెంటే తన పయనమంటూ స్పష్టంచేశారు. సీఎం జగన్ ముఖ్య అనుచరుడు సంప్రదించినా బాబ్జి ససేమిరా అన్నా రు. కేడర్ చెక్కు చెదరకుండా టీడీపీ అధి నాయకత్వం బాబ్జికి దిశా నిర్దేశం చేసింది. అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి పనిచేద్దామంటూ బాబ్జి కేడర్‌కు హితబోధ చేశారు.

ముదురుతున్న ఎండలు

- రెండు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు

(భీమవరం- ఆంధ్రజ్యోతి)

ఎండలు ముదురాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రత 35 డిగ్రీలు నమోదు కావడం విశేషం, రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలు పెరిగాయి. శివరాత్రికి శివ... శివ అంటూ చలివెళ్ళిపోతుందనేది సామెత. మొన్నటి వరకు 16, 18 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రతలు శివరాత్రి రోజు నుంచి 20 డిగ్రీలకు చేరింది. దీంతో కొన్ని నెలలుగా సాధారణ ఉష్ణోగ్రతలకు అలవాటు పడిన జనం మారిన ఉష్ణోగ్రతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం ఎండ చుర్రుమనిపించింది. మార్చి నెల రెండో వారం పూర్తి కావడంతో క్రమంగా వేసవి ఎండలు మొదలు కానున్నాయి. వరి పంటకు ఎండలు ప్రయోజనం కలిగించినా ఆక్వా రంగానికి ఇబ్బందికరమే. ఉష్ణోగ్రతలపై ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది ఈ ఏడాది ఎలినో పరిస్థితులు కారణంగా ఎండ తీవ్రత పెరిగి వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చని చెబుతున్నారు. మరో వైపు వంతుల వారీ విధానం వల్ల పెరుగుతున్న ఎండలకు సాగునీటి ఇబ్బందులు పెరిగే అవకాశం ఉంది. పట్టణంలోను, గ్రామాల్లోను మంచినీటి ఎద్దడి తప్పని పరిస్థితి ఉంది.

ఏజెన్సీ బంద్ విజయవంతం



బుట్టాయ గూడెంలో..

ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, జీవో నెంబరు 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం మండలాల్లో బంద్ నిర్వహించారు. షాపులను మూయించి రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి నిరసనలు తెలిపారు. ప్రత్యేక డీఎస్సీపై గిరిజన యువత ఆశలపై ప్రభుత్వం నీళ్ళు చల్లిందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా ప్రభుత్వం చేసిందని గిరిజన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రయాణం ప్రమాదం

- పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరుపై ప్రమాదకరంగా పడవ ప్రయాణం
- అనుమతులు లేకుండానే ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణ
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణికుల రాకపోకలు
- వంతెన నిర్మించాలంటూ డిమాండ్



కలిదిండి, మార్చి 10 : పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరు వద్ద పడవ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం పెదలంక పల్లిపాలెం, పెదపుట్లపూడి, రామకృష్ణాపురం, మూల్లంక, మల్లంపూడి, చోరంపూడి, బంటుమిల్లి గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం పడవపై ఉప్పుటేరు దాటి భీమవరం వెళ్లి వస్తుంటారు. ఉప్పుటేరు తీర ప్రాంతాల్లో చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో చేపలు, రొయ్యలను పడవపై తీసుకెళ్తుంటారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సరిహద్దున ఉండడంతో విద్యార్థులు ఉప్పుటేరు దాటి భీమవరం కళాశాలలకు వెళ్లి వస్తుంటారు. పెదలంక నుంచి గుర్వాయిపాలెం వయా ఏలూరుపాడు మీదుగా రోడ్డు మార్గంలో వెళ్లే సుమారు 45 కిలోమీటర్ల దూరం వస్తుంది. పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరు వద్ద పడవ దాటి కల్వపూడి వయా జువ్వలపాలెం మీదుగా 22 కిలోమీటర్లే వస్తుండడంతో పడవనే ప్రజలు ఆశ్రయించి రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో పలుమార్లు పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరు వద్ద పడవ ప్రమాదాలు జరిగాయి. అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు పడవను నడుపుతున్నారు. ప్రయాణికులకు లైఫ్ జాకెట్స్ ఇవ్వడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే మా పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు పొందకుండా పంచాయతీ ఆదాయానికి పడవ నిర్వాహకులు గండి కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నాగబాబును వివరణ కోరగా.. 'పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరు వద్ద పడవ ప్రయాణానికి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు. అనధికారికంగానే పడవను ఏర్పాటు చేసి ఉప్పుటేరుపై ప్రయాణం చేస్తున్నారు. పడవ యజమానులపై చర్యలు తీసుకుంటాం. పంచాయతీ ద్వారా వేలం పాట నిర్వహించి అనుమతులు మంజూరు చేసి ప్రయాణికులు లైఫ్ జాకెట్లు ధరించే విధంగా చర్యలు తీసుకుంటాం'.. అని తెలిపారు.

భయమేస్తోంది..

ఉప్పుటేరుపై పడవ ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది. ఒక్కోసారి పరిమితికి మించి ఎక్కుతున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు పడవ ప్రయాణం సమయంలో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కె.శ్రీనివాస్, గ్రామస్థుడు

వంతెన నిర్మించాలి

పెదలంక పల్లిపాలెం ఉప్పుటేరుపై వంతెన నిర్మిస్తే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం. పడవ ప్రయాణం ప్రమాదకరంగా ఉండడంతో ఏ క్షణంలో పడవ నీటమునుగుతుందోనని బిక్కుబిక్కు మంటూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. వంతెన నిర్మాణానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు



పాలి ప్రసాద్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బడేటి చంటి, తదితరులు

పాలి ప్రసాద్‌కు కన్నీటి వీడ్కోలు

ఏలూరు టూటౌన్, మార్చి 10 : అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ (71) అంత్యక్రియలు లక్ష్మమ్మ చెరువు శ్మశాన వాటికలో ఆదివారం జరిగాయి. ఆయన అన్న కుమారుడు కృష్ణమూర్తి అంత్యక్రియల క్రతువు నిర్వహించారు. అంతకుముందు గులాబితోటలోని ఆయన నివాసానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి, మాజీ మంత్రి కేఎస్ జవహర్, మారడాని రంగారావు, మాజీ ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఇన్‌చార్జ్ రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ శ్యామ్‌చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, పాకలపాటి గాంధీ, వరప్రసాదరావు, మున్నుల గురునాథ్‌జాన్, పెద్దాడ వెంకటరమణ, లంకపల్లి మాణిక్యాలరావు, దాసరి ఆంజనేయులు, జయవరపు శ్రీరామమూర్తి తదితరులు విచ్చేసి ప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన కుమార్తె వరలక్ష్మికి ధైర్యం చెప్పారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పాలి ప్రసాద్ మరణం టీడీపీకి తీరని లోటన్నారు. ఏనాడు పదవులకు ఆశించకుండా పార్టీ పటిష్టతకే ఆయన కృషి చేశారన్నారు.



కలలకు రెక్కలు బ్రోచర్లను ప్రదర్శిస్తున్న టీడీపీ, జనసేన వీరమహిళలు

ఆడబిడ్డల చదువు కోసం 'కలలకు రెక్కలు'

భీమవరం అర్బన్, మార్చి 10: రాష్ట్రంలో ఆడబిడ్డల చదువులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా కలలకు రెక్కలు అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ,జనసేన వీర మహిళల సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల ద్వారా బీజేపీ, టీడీపీ జనసేన పార్టీల ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచే ఇంటర్మీయట్ ఉత్తీర్ణులైన విద్యార్థినుల ఉన్నత చదువులకు ఊతం ఇచ్చేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకాన్ని టీడీపీ జనసేన వీరమహిళలు ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని కోరారు. జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇంటర్ పాసైన విద్యార్థినులు ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకులు రుణం అందిస్తాయన్నారు. అంగన్వాడీ డ్వాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టీడీపీ మహిళా నాయకులు మాదాసు కనకదుర్గ, ఎండీ షబీనా, సయ్యద్ నాసిమా బేగం, రొంగల కృష్ణవేణి, ఉప్పలపాటి లక్ష్మి, గొంతెన వెంకట రమణ, గంధం రాధా, జనసేన వీరమహిళలు శ్యామల, పావని, ప్రవల్లిక, ప్రతిభ, పూర్ణిమ, కల్పన, సావిత్రి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 10: ప్రత్యేక హోదా అమలు చేయాలని కోరుతూ తాడేపల్లిగూడేనికి చెందిన కూసంపూడి విజయ్ ఆదివారం గాంధి వేషధారణలో ఆమరణ దీక్షకు దిగారు. రాష్ట్రాన్ని అడ్డకోలుగా విడదీసి ఆంధ్ర రాష్ట్రాభివృద్ధిని, యువత భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారన్నారు. రైల్వే కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నానని కానీ రాష్ట్రంలో ఎలాంటి కార్మాగారాలు లేక, యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై భరోసా ఇవ్వాలన్నారు.



నిత్యాన్నదానానికి రూ.15 లక్షలు విరాళం

ద్వారకాతిరుమల, మార్చి 10: చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక దాత ఆదివారం రూ.15 లక్షలను విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన కార్తీక్ పద్మనాభన్ ఈ విరాళాన్ని ఆలయ అధికారులు త్రినాథరావు, శ్రీనివాసులకు అందజేశారు. దాత శ్రీవారిని అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు.



కమ్మేసిన పొగమంచు

ఉండి, మార్చి 10: ఉండి నుంచి భీమవరం వెళ్లే ఎన్‌హెచ్ రహదారిపై ఆదివారం ఉదయం మంచు దట్టంగా కమ్మేసింది. రహదారులపై వెళ్లేవారికి దారి కనిపించలేదు. అలాగే ఉండి నుంచి గణపవరం వెళ్లే రహదారిలో మంచు కమ్ముకుంది. వరిచేలో పనులను చేసుకునే రైతు కూలీలు మంచు తెరలు వీడాక పనులు ముగించారు.



ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మండవల్లి, మార్చి10: రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్ అన్నారు. ఆదివారం మండవల్లి మండలం కానుకొల్లు, ఉనికిలి, భైరవపట్నం గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ఆయా గ్రామాల్లో కవాతు చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వారికి కావాల్సిన పార్టీకి వేసుకోవాలన్నారు. ఎవరైనా భంగం కలిగిస్తే చట్టరీత్యా నేరమని, ఎన్నికల్లో ప్రలోభాలాకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండవల్లి ఎస్‌ఐ సీహెచ్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కోడిగూడెం.. కొల్లగొడుతున్నారు

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు...పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల, మార్చి 10: దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ... కొందరు వైసీపీ నాయకులు చెరువు కన్పిస్తే చాలు అందులోని మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. ఏ అనుమతులు లేకుండానే చెరువుల్లోని మట్టిని యథేచ్ఛగా తవ్వి విక్రయిస్తూ అందినకాడికి దండు కుంటున్నారు. అధికారుల చూపు అక్రమ తవ్వకాలపై పడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అండదండలతో ఏ బెరుకూ లేకుండా యథేచ్ఛగా తవ్వి చెరువుల ఆకృతిని దెబ్బతీస్తూ విలువైన మట్టిని తరలించేస్తున్నారు. మండలంలోని కోడిగూడెం ఊర చెరువు సమీపంలోని బొతుకుకుంట చెరువులో ఆదివారం ఒక జేసీబీ, ఆరు ట్రాక్టర్లతో ఈ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మట్టిని పలు ప్రాంతాలకు తరలిస్తూ దూరాన్ని బట్టి సొమ్ములు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. విచ్చలవిడిగా ఇలా చెరువులను సైతం వదలకుండా తవ్వుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందులో స్థానిక ప్రజా ప్రతినిధులకు కమీషన్లు అందుతున్నాయంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇదేం ఖర్మ!

వైసీపీ ప్రచార సభలు ప్రయాణికులతో పాటు విద్యా సంస్థల యాజ మాన్యాలకు తలనొప్పిగా మారుతున్నాయి. ఎక్కడ సభ జరిగినా చుట్టు పక్కల జిల్లాల ఆర్టీసీ బస్సులను, విద్యాసంస్థల బస్సులను జనాన్ని తరలించటానికి తీసుకు వెళుతూండటంతో ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆదివారం వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఇదెక్కడి ఖర్మరా బాబు అంటూనే ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు చేశారు.

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు
ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన ప్రయాణికులు
మండుటెండలో బస్టాండ్లు,రోడ్లపై అవస్థలు

భీమవరం టౌన్, మార్చి 10 : పకాశం జిల్లా మేదరమెట్లలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు వెళ్ళటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. భీమవరం, తణుకు డిపోల నుంచి 28 బస్సుల చొప్పున, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల నుంచి 22 బస్సుల చొప్పున పంపించారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 80 బస్సులను తరలించారు. భీమవరం డిపోకు సబంధించి 28 బస్సులు పంపించడంతో ఆదివారం జయవాడ, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం వెళ్లే పలు సర్వీసులను రద్దు చేశారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్ కాంప్లెక్స్‌కు చేరుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నరసాపురం డిపో నుంచి 22 బస్సులు

నరసాపురం : నరసాపురం డిపో నుంచి వెళ్లిన 22 బస్సుల్ని చీరాల డిపోకు కేటాయించారు.శనివారం సాయంత్రమే బస్సులు బయలుదేరి వెళ్లాయి. డిపోలో మొత్తం 60 సర్వీసులు ఉన్నాయి. వాటిలో 22 బస్సులు వెళ్లిపోవడంతో మిగిలిన 38 సర్వీసుల్ని ఆదివారం నడిపారు. ఎక్కువగా పల్లె వెలుగు బస్సులే వెళ్లాయి. దీంతో రాజమండ్రి, తణుకు, భీమవరం, మచిలీపట్నం, నిడదవోలు సర్వీసులు అరకొరగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం డిపోలో పడిగాపులు కాశారు

తాడేపల్లిగూడెం నుంచి 22..

తాడేపల్లిగూడెం రూరల్ : వైసీపీ సిద్ధం సభ కోసం తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి బస్సులు భారీగా తరలించారు. తాడేపల్లిగూడెం డిపోలో 54 ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో సిద్ధం సభ కోసం 22 బస్సులు తరలించినట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక అంతా ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో ప్రయాణికులు మండుటెండలో సైతం బస్సుల కోసం పడిగాపులు కాశారు. దగ్గర ప్రయాణం ఉన్నవారు ఆటోలతో సరిపెట్టుకోగా దూర ప్రయాణికులు మాత్రం బస్సుల కోసం పడిగాపులు కాస్తూనే ఉన్నారు.

తణుకు నుంచి 28 బస్సులు

తణుకు : తణుకు డిపో నుంచి అధిక మొత్తంలో కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డిపోలో 85 బస్సులు ఉండగా సభ కోసం 28 బస్సులు కేటాయించారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్ళే రూట్లలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ఒక పక్క ఎండలు మండుతుండడంతో ఉక్కపోతతో బస్టాండ్లు, రోడ్లమీద వాహనాలు కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బస్సులు లేకపోవడంతో ఏలూరులో కూర్చొన్న ప్రయాణికులు



తాడేపల్లిగూడెంలో ఎండలో బస్సుల కోసం పడిగాపులు

బస్సులు లేక జనం పాట్లు

ఏలూరు రూరల్ : ఆదివారం ఏలూరు ఆర్టీసీ బస్టాండులో బస్సులకోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఆదివారం ఉదయం నుంచే సిద్ధం సభకు బస్సులను పంపించారు. డ్రైవర్లు సిద్ధం సభకు వెళ్ళేందుకు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మూడు రోజుల పాటు శైవక్షేత్రాలకు తిరిగి కొద్దిపాటి విశ్రాంతితో బస్సులు నడుపుతుంటే ఇప్పుడు సిద్ధం సభకు ఒకరోజు విధులు పొడిగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి బస్సుల కొరతతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నరసాపురం బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఆలయానికి చేరిన సోమేశ్వరుడు



భీమవరం టౌన్, మార్చి 10 :పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమవరం-గునుపూడి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అలంకరించిన పూల రథంలో పార్వతీ అమ్మవారితో కలసి సోమేశ్వరస్వామి రథంలో భక్తుల ఆనందోత్సవాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. శనివారం రాత్రి నాచువారి సెంటర్‌లో కొలువుతీరిన సోమేశ్వరస్వామికి ఆదివారం ఉదయం ప్రయాగ వారి కుటుంబ సభ్యులు పార్వతీ అమ్మవారికి వడుగంటు బియ్యం అందించారు. ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణలు స్వామి, అమ్మవారికి పూజలు చేసి హారతులు అందించిన తరువాత మేళతాళాల మధ్యభక్తులు జయజయ ధ్వానాల మధ్య స్వామివారి రథం అయ్యగారి వీధిమీదుగా సోమేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరింది. మార్గమధ్యలో రథం చక్రం డ్రైనేజీలో ఇరుక్కు పోవడంతో కొంత ఆటంకం కలిగింది. అనంతరం ముందుకు సాగింది. మార్గమధ్యలో స్వామివారికి మహిళలు హారతులు ఇచ్చారు. కుంభాలు పోసారు. ఆలయం దగ్గరకు చేరుకోగానే గునుపూడి బ్రాహ్మణ ఆడపడుచులు పార్వతీ అమ్మవారికి సారె అందించారు. తదుపరి స్వామివారిని, అమ్మవారిని పల్లకీల్లో ఆలయంలోకి చేర్చారు. అనంతరం స్వామివారికి వసంతోత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. డీఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.

అమ్మవారికి సారె అందించిన ఆడపడుచులు

చంద్ర పుష్కరిణిలో జల విహారం

రాత్రి చంద్ర పుష్కరిణిలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామివారు తెప్పపై విహరించారు. ప్రత్యేక పూజలు చేసిన నిర్వహించిన అనంతరం క్షేత్రపాలకులైన జనార్దనస్వామి వెంట రాగాప్రత్యేక వాహనంలో చంద్రపుష్కరిణికి చేరుకున్నారు.అలంకరించిన తెప్పపై పురోహితులు స్వామి, అమ్మవార్లను ఉంచి హారతులందించారు. తదుపరి బాణసంచా కాల్పుల మధ్య మేళ తాళాలతో తెప్ప ముందుకు సాగింది.



అమావాస్య స్నానాలకు పోటెత్తిన భక్తులు

ముసునూరు, మార్చి 10: బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు స్వామివారి పవళింపు సేవతో వైభవంగా ముగిశాయి. ఆదివారం అమావాస్య కావడంతో పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. తమ్మిలేరు భక్తులతో కిక్కిరిసింది. క్యూలైన్‌ల్లో వేచిఉండి స్వామివారి దర్శంచుకున్నారు. బహ్మ శివలింగం, నాగేంద్రస్వామి పుట్టవద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఉదయం బిందెతీర్థం, బలిహరణ, వసంతో త్సవం, గ్రామోత్సవం, అవభృతం, సాయంత్రం హోమం, బలిహరణాధులు, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షణలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో రాత్రి రామలింగేశ్వరస్వామి, రాజ రాజేశ్వరిదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు, వివిధ రకాల పుష్పాలతో ఉయ్యాలను అలంకరించి, మహిళలు మంగళహారతులతో గీతాలు ఆలపించి స్వామివారి పవళింపుసేవ వైభవంగా నిర్వహించారు.



ఊరేగింపులో స్వామివారికి హారతులు.. త్రిశూలేశ్వరుడికి స్నానం

నేత్రపర్వం..శివదేవుని వసంతోత్సవం

ద్వారకాతిరుమల, మార్చి 10: శివదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం త్రిశూలస్వామికి జరిగిన అర్చన, అభిషేకం, వసంతోత్సవం భక్తులకు నేత్రపర్వమయ్యాయి. క్షేత్రపాలకుని ఆలయంలో ఉదయం శ్రీచక్ర వార్యుత్సవం, మహా పూర్ణాహుతిలను నిర్వహించారు. గంగాపార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను పూల మాలికలతో అలంకరించిన వాహనంలో ఉంచి పూజాదికాలను చేశారు. అనంతరం మేళ తాళాల నడుమ శివదేవుడు కొలువైన వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతీ ఇంటి ముందు స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులివ్వగా, అర్చకులు వారికి వేడుకగా వసంతాలను అందించారు. రాత్రి ధ్వజ అవరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



పవిత్ర ప్రార్థనలకు వేళాయె

రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ముదినేపల్లి, మార్చి 10:రంజాన్ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ముస్లింలకు ఈ మాసం ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలో చేసే ప్రతీ ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రెట్లు ఫలితాలను అందిస్తున్నదన్నది ముస్లింల విశ్వాసం. నెల రోజులపాటు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలను నిర్వహిస్తారు. భగవత్ ఆశీస్సులు అందించే ఈ పవిత్ర రంజాన్ కోసం ముస్లింలు సంవత్సరమంతా ఎదురుచూస్తుంటారు. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెల పొడుపు కనిపించగానే ఈ ఏడాది రంజాన్ మాసం ప్రారంభమవుతుందని, మంగళవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

ఐదు పూటలా నమాజ్

ప్రతీరోజూ ఉపవాస దీక్షలు పాటించే ముస్లింలు నమాజ్‌కు ప్రథమ ప్రాధాన్యతనిస్తారు. ఈ నెలంతా నమాజ్‌కు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. సూర్యోదయానికి ముందు (సహర్) నుంచి సూర్యాస్తమయం (ఇఫ్తార్) వరకు ఉపవాస దీక్షలు పాటిస్తారు. రోజూ ఐదురు పూటల నమాజ్ చేయడం రంజాన్ మాస ప్రత్యేకత. ఇందుకు అదనంగా రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు సాగే 'తరావీహ్' నమాజ్‌తో ఖురాన్ పఠనం చేస్తారు.

ధానధర్మాలకు ప్రాధాన్యం

రంజాన్ మాసాన్ని భూమిపై దివ్య ఖురాన్ అవతరించిన మాసంగా ముస్లింలు భావిస్తారు. ఈ మాసంలో "నఫిల్" చదివితే "ఫరజ్" చదివినంతగా అంటే 70 సార్లు నమాజ్ చేసిన పుణ్యం వస్తుందన్నది ఇస్లాం గ్రంథాలు ప్రబోధిస్తున్నాయట. ఈ మాసంలో ధానధర్మాలకు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతీ ముస్లిం నిర్ణీత దానం తప్పనిసరిగా చేయాలట. ఇది ఎన్నో రెట్లు ఫలితాలను అందిస్తాయన్నది విశ్వాసం

హలీం..రంజాన్ ప్రత్యేక వంటకం

రంజాన్ మాసంలో ముస్లింలకు రుచికరమైన వంటకం హలీం. గతంలో హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వంటకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. పలు ప్రాంతాల్లో రంజాన్ స్పెషల్ హలీం విక్రయాలకు స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. హలీం వల్ల శరీరం బలంగా తయారవుతుందన్నది ముస్లింల నమ్మకం.

ఏప్రిల్ 9న ముగింపు

రంజాన్ మాసం ఏప్రిల్ 9 సాయంత్రం ముగుస్తుంది. మరుసటి రోజు ఈద్ -ఉల్- ఫితర్ వేడుకతో ఉపవాస కాలం ముగుస్తుందని మత పెద్దలు చెబుతున్నారు. మహ్మద్ ప్రవక్త రూపొందించిన ఖురాన్ పఠనం ముస్లింలకు స్వీయ క్రమశిక్షణ, ఆధ్యాత్మిక వృద్ధికి దోహదం చేయడం రంజాన్ మాసానికి ప్రతీకగా చెబుతుంటారు.

క్రైం కార్నర్

బాణసంచా తలపై పడి బాలిక మృతి

వీరంపాలెం శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి



మృతి చెందిన పుష్ప.. ఫైల్‌ఫొటో

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 10: తాడేపల్లి గూడెం మండలం వీరంపాలెం మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి బాణసంచా కాల్పుల్లో భాగంగా తారాజువ్వ బాలిక తలపై పడి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన దాసరి పుష్ప తన స్నేహితురాలితో కలిసి శివరాత్రి ఉత్సవాల ఊరేగింపు తిలకించేందుకు వచ్చింది. ఊరేగింపులో భాగంగా బాణసంచా కాలుస్తుండగా టపాసు విఫలమై బాలిక తలపై పడింది. దీంతో పుష్ప తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరి మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

త్యాజంపూడిలో విషాద ఛాయలు

దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన దాసరి చిట్టి, లక్ష్మీ దంపతుల కుమార్తె పుష్ప(16) యర్నగూడెం హాస్టల్‌లో ఉంటూ జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. శివరాత్రికి సెలవులు రావడంతో ఇంటికి వెళ్ళి బాబాయ్ కుమార్తెతో కలిసి వీరంపాలెం ఉత్సవాలు చూడడానికి వెళ్లింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం రాత్రి బాణసంచా కాలుస్తుండగా పుష్ప తలపై టపాస్ పేలడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. దాసరి చిట్టి, లక్ష్మీలకు ముగ్గురు పిల్లలు. ఒక కుమారుడు వ్యవసాయ కూలీపని చేస్తుండగా రెండో కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె పుష్ప మృతితో త్యాజంపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. హైస్కూల్ హెచ్‌ఎం ఉబా చంద్రరావు, సర్పంచ్ స్వరూపరాణి సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు

పెనుమంట్ర, మార్చి 10 : పొలమూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. కొనితివాడ గ్రామానికి చెందిన కడలి ప్రసాద్ (73) మోటార్ సైకిల్‌పై బ్రాహ్మణ చెరువు వైపువెళ్తుండగా భీమవరం వైపు వెళ్లే కారు ఢీకొనడంతో ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది చేరుకుని క్షతగాత్రునికి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం తణుకు ప్రైవేటు హాస్పటల్‌కి తరలించారు.

రైలు పట్టాలపై యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మార్చి 10 : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ దగ్గరలో రైలుపట్టాలపై ఒక యువకుని మృతదేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు పెదపాడు మండలం ఏపూరు పంచాయతీ పరిధిలోని తిమ్మనవీడికి చెందిన ఊటుకూరి నరేష్ (31)గా గుర్తించారు. రైలు పట్టాలు దాటుతుంటే ఏదైనా రైలు ఢీకొందా లేదా రైలు నుంచి జారిపడ్డాడా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

పాము కాటుతో మహిళ మృతి

టి.నరసాపురం, మార్చి 10 : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుకుంది. కుక్కునూరు మండలం దాచారం గ్రామానికి చెందిన వర్సా లక్ష్మి, సుబ్బయ్య దంపతులు టి.నరసాపురం మండలం శ్రీరామవరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఎప్పటి మాదిరిగానే లక్ష్మి ఈ నెల 9వ తేదీన ఉదయం శ్రీరామవరంలో జీడితోటలో చెట్ల కింద ఆకుల శుభ్రం చేసే పనికి వెళ్లగా రక్త పింజర పాము కాటు వేయడంతో వెంటనే చింతలపూడి ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు తెలిపారు. భర్త సుబ్బయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, మార్చి 10 : వ్యక్తి ఆత్మహత్యపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జ్యోతిబాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన చిట్టూరి పవన్‌కుమార్ జంగారెడ్డిగూడెంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడన్నారు. చేసిన అప్పులు చెల్లించలేక ఈ నెల 7వ తేదీ రాత్రి గడ్డి మందు తాగాడన్నారు. గమనించిన కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న పవన్‌కుమార్‌ను జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారన్నారు. చికిత్స పొందుతూ 9వ తేదీ రాత్రి పవన్‌కుమార్ మృతిచెందాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం..కేసు నమోదు

టి.నరసాపురం, మార్చి 10 : అక్రమంగా రేషన్ బియ్యాన్ని కలిగి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్ కుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడి చేసి 19 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 11వ నెంబరు దుకాణానికి తరలించినట్లు తెలిపారు. డిప్యూటీ తహసిల్దార్ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ పోస్టు వద్ద మద్యం స్వాధీనం



ఏలూరు క్రైం, మార్చి 10 : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావుల ఆదేశాలతో సరిహద్దు జిల్లాలు, అంతర్ రాష్ట్ర సరి హద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్‌కు అందిన సమా చారంతో నూజివీడు మండలం పార్వతీపురం చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ ఎస్‌ఐ కుమార్, ఏఎస్‌ఐ పూర్ణ, కానిస్టేబుళ్ళు రాంబాబు, వెంకట్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఒక ఆటోలో 132 మద్యం బాటిల్స్ ఉండడాన్ని గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని నూజివీడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ ఆదివారం రాత్రి తెలిపారు.

ద్వారకా తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ


ఖాళీగా కనిపిస్తున్న క్యూలైన్లు

ద్వారకాతిరుమల, మార్చి 10: శ్రీవారి క్షేత్రానికి అమావాస్య ప్రభావంతో భక్తుల రద్దీ తగ్గింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. అమావాస్య కావడంతో పాటు రానున్నది ఫాల్గుణ మాసం అవడం వల్ల ఆలయానికి వందల సంఖ్యలోనే యాత్రికులు తరలివచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు దాదాపు ఖాళీగా కన్పించాయి.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, మార్చి 10: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం, అమావాస్య కావడంతో భక్తుల సంఖ్య తగ్గింది. అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులు



చింతలపూడి, మార్చి 10: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేగిలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ముగింపు రోజు నందివాహనంపై ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో పార్వతీ పరమేశ్వరులను వైభవంగా ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు వాహనం వెంట రాగా ప్రసాదాలు వితరణ చేశారు.

శివాలయాల్లో అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 10: నగరంలోని శివాలయాల్లో అమావాస్య సందర్భంగా అభిషేకాలు, పూజలు, బిల్వార్చన చేశారు. నవగ్రహాల మందిరాల వద్ద తైలాభిషేకాలు చేశారు. మార్కండేయస్వామి, రేవులింగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి, నగరేశ్వరస్వామి, ప్రతాప కాశీ విశ్వేశ్వరస్వామి, చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

● కామవరపుకోట: ఆడమిల్లి శనీశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా స్వామివారికి తైలాభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు శనీశ్వరస్వామిని అమావాస్య సందర్భంగా ఆరాధించారు. వీరభద్రస్వామి, శ్రీ లక్ష్మీ హయగ్రీవ పీఠం, ఏకాంబరేశ్వరస్వామి, తడికలపూడి గాంగేశ్వరస్వామి, జీలకర్రగూడెంలోని ధర్మలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద పూజలు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

ఏలూరు కార్పొరేషన్ / కల్చరల్, మార్చి 10: అగ్రహారం రామకోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కళావేదికపై కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నమయ్య సంకీర్తనాలాపన అలరించింది. తొలుత తులసీ దళాలతో సీతారామలక్ష్మణ హనుమంతుల వారి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ బృందం అన్నమయ్య సంకీర్తనాలాపన, వాయిద్య సమ్మేళనం విశేషంగా అలరించింది. వాసు బృందం సంగీత వాయిద్య సమ్మేళనం ఆకట్టుకుంది. పెద్దసంఖ్యలో ప్రేక్షకులు హాజరు అయ్యారు. ఒకవైపు సంకీర్తనాలాపన, మరోవైపు వాయిద్య సమ్మేళనం రసరమ్యంగా సాగింది.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

టి.నరసాపురం, మార్చి 10: మక్కినవారిగూడెం, టి.నరసాపురంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ప్రధానంగా టి.నరసాపురంలో అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులకు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద పూజలు ముగింపు సందర్భంగా హోమం నిర్వహించారు. ఆలయం వద్ద త్రిశూల, ధ్వజారోహణ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణ నివారించాలి


చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కట్లయ్య

ఏలూరు రూరల్, మార్చి 10: ప్రభుత్వాలు రజకులకు జీవోల ప్రకారం చెరువులు కేటాయిస్తే ఇతరులు వాటిని ఆక్రమించుకుంటున్నారని, అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. సుంకరవారితోట సమీపంలో రజకుల చెరువుగట్లపై చెట్లను కొంతమంది నరికివేశారని రజకులు అధికారులను ఆశ్రయించారు. ఆదివారం రజక సంఘ నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కట్లయ్య మాట్లాడుతూ 1903లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రజకులకు అధికారికంగా చెరువును కేటాయించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు రజకుల స్వాధీనంలోనే ఉందన్నారు. ఇప్పుడు దీనిని కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించాలని రజకుల వృత్తిచెరువుల విషయంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ నేతలు జి.శ్రీనివాసరావు, ఏ.వీరాస్వామి, జి.గిరిరాజు, ఎస్.మురళి, ఎ.అన్నవరం, డి.సత్యనారాయణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో స్క్వాయ్ కొత్త తరహా క్రీడ



స్క్వాయ్ ప్రతినిధి బృందం

ఏలూరు స్పోర్ట్స్, మార్చి 10: స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఏపీ అనుబంధ సంస్థ స్క్వాయ్ సాధారణ సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర చైర్మన్ ఇస్మాయేల్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో స్క్వాయ్ కొత్త తరహా క్రీడ అన్నారు. ఈ క్రీడపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని ఇప్పటివరకు శాప్ ద్వారా క్రీడాపోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో విద్యార్థులు పతకాలు సాధించారన్నారు. తాజాగా ఖేలో ఇండియా ద్వారా స్క్వాయ్ క్రీడ ఆరంగ్రేటం చేయనుందని తెలిపారు. రాబోయే రోజుల్లో స్క్వాయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా 2024లో క్రీడారంగం అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రకార్యదర్శి ఇబ్రహీమ్, అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్, సెక్రటరి మహ్మద్ ఖాజా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న యామిని

వేలేరుపాడు, మార్చి 10: మహిళలపై దాడులు, అరాచకాలను అరికట్టాలని ఏపీ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం మహిళ సమాఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. రాజకీయలబ్ధి కోసం ప్రభుత్వాలు ఇష్టానుసారంగా నిర్ణయాలతో మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆమె ఆరోపించారు. మహిళ కార్మికులకు వెట్టి చాకిరి నుండి, ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, అనంతలక్ష్మి, జయ, విమల, భద్రకాళి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘ కమిటీల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ప్రముఖులు

ఆర్యవైశ్య సంఘ కమిటీల ప్రమాణస్వీకారం

చింతలపూడి, మార్చి 10: ఆర్యవైశ్య సంఘాల పట్టణ, మండల కమిటీల ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. మహిళలకు గేమ్స్, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా వజ్రపు శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొనకళ్ళ ప్రసాద్, కోశాధికారిగా చిట్లూరి వెంకటరమణ, మండల అధ్యక్షుడిగా ఏవీ.రాజారావు, ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామకృష్ణ, ఆర్యవైశ్య మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలిగా కొనకళ్ళ రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా కేతేపల్లి స్రవంతి, ఉపాధ్యక్షులు, గౌరవ సలహాదారులు, సహాయ కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, ఎన్.శ్రీనివాసరావు, ఎస్.విశ్వేశ్వరరావు, వి.సత్యనారాయణ, ప్రసాద్, జె.వైకుంఠరావు పాల్గొన్నారు.


చింతలపూడిలో టీడీపీ, జనసేన నేతల సంఘీభావం


బడేటి చంటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్, కార్యకర్తలు

గెలుపే లక్ష్యంగా పోరాడాలి

టీడీపీ, జనసేన నేతల పిలుపు

చింతలపూడి, మార్చి 10: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన పోరాడాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య అన్నారు. స్థానిక షాదీఖానాలో ఉమ్మడి అభ్యర్థి రోషన్‌కుమార్ పరిచయ కార్యక్రమం నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ జనసేన నేత పవన్‌కల్యాణ్ పిలుపే శిరోధార్యమని రాష్ట్ర ప్రయోజనం కోసం మనమందరం ఉమ్మడి అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. వైసీపీ పాలనలోని అరాచక చర్యను గుర్తు చేశారు. ఉమ్మడి అభ్యర్థి రోషన్‌కుమార్‌ను జనసేన కార్యకర్తలకు సభా వేదికపై పరిచయం చేశారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ తాను గెలిస్తే జనసేనకు నియోజకవర్గంలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పలు గ్రామాల నుంచి వచ్చిన వారు జనసేనలో చేరుతున్నట్టు ఈశ్వరయ్య ప్రకటించి కండువాలు కప్పారు. జనసేన నాయకులు ఘంటశాల వెంకటలక్ష్మి, ఆది సత్యనారాయణ, ఎ.అప్పారావు, చీదరాల మధుబాబు, మాదాసు కృష్ణ, సుబ్రహ్మణ్యం, షేక్ వలీ, టీడీపీ నాయకులు ఘంటా మురళీ రామకృష్ణ, జగ్గవరపు ముత్తారెడ్డి, గోరుముచ్చు గోపాల్‌యాదవ్, గుత్తా వరప్రసాద్, చలపతిరావు, పక్కాల వెంకటేశ్వరరావు, దేవ, వెంకట్రామయ్య, పలువురు నేతలు పాల్గొన్నారు. 4 మండలాల నుంచి జనసేన కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వెంకటాపురం, చింతంపల్లి, సీతానగరం గ్రామాల్లో జరిగిన పరిచయ కార్యక్రమాల్లో రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం సీఎస్ఐ చర్చ్, ఆర్‌సీఎమ్ చర్చ్‌లలో సొంగా రోషన్‌కుమార్ ఆదివారం ప్రార్థనలు చేశారు. శ్రమల దినాలను పురస్కరించుకుని ఏసుక్రీస్తు బోధనలను అందరూ పాటించాలన్నారు. చర్చ్ పాస్టర్లు, గ్రామస్థులు సొంగా రోషన్‌కుమార్‌ను సన్మానించారు. తాడేపల్లి దాసు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: అధికార పార్టీలో ఉన్నా ప్రజల కనీస అవసరాలు తీర్చలేకపోతున్నామనే వేదనతో వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరు టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు టీడీపీలోకి వలస వచ్చారు. 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి, సురేష్‌కుమార్ దంపతులతో పాటు వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి బడేటి చంటి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. 15వ డివిజన్ నుంచి రమణయ్య, జె.వెంకన్న, రాట్నాలు, ఇస్సాకు, జి.రామాంజనేయులు, అనుచరులంతా టీడీపీ తీర్థ పుచ్చుకున్నారు. చోడే వెంకటరత్నం, మాణిక్యం, చంద్రయ్య, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 2014 ఎన్నికల ఫలితాలు పునరావృతం కానున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఒక కూటమిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో విజయం ఖాయమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం కుటమితోనే సాధ్యమని, కేంద్ర సహకారం కూడా అవసరమన్నారు. 2014 కూడా ఈ కూటమి అధికారం చేపట్టిందని అప్పుడు ముస్లిం, మైనార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి దాడులు జరగలేదని, జగన్ రెడ్డి పాలనలో ఈ వర్గాలపైనే అత్యధిక దాడులు జరిగిన విషయాన్ని ప్రజలు గమనించారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓట్లు వేసి గెలిపించడానికి ప్రజలు సంసిద్ధమై ఉన్నారన్నారని శేషు అన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న పత్సమట్ల ధర్మరాజు


టి.నరసాపురంలో మాట్లాడుతున్న బాలరాజు


కార్యకర్తలతో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రజా సమస్యలపై జనసేన నేతల ఆరా

ఉంగుటూరు, మార్చి 10: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని నల్లమాడు, రామచంద్రపురం గ్రామాలలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన జగన్ రెడ్డి అభివృద్ధి చేయలేదన్నారు. ఆదాయ వనరులు సమకూర్చే పనులు చేయలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షులు పంది రాంబాబు, నల్లమాడు ఉప సర్పంచ్ ఇల్లిందల సురేష్, నల్లమాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు మిరియాల మంగరాజు, స్థానిక నాయకులు గౌతు బాల భాస్కర్, గౌతు రాజేష్, సుంకవల్లి బాలకృష్ణ, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: అల్లూరి సీతారామరాజు నగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలని జనసేన పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు కాసనేని వెంకట్రావు ఇంటి వద్ద టీడీపీ నాయకులు కార్యకర్తలను కలిసి మద్దతు కోరారు. ఏఎస్ఆర్ నగర్ వాసులను కలసి సమస్యలు తెలుసుకున్నారు. పదేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్నామని, కరెంటు, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. జనసేన, టీడీపీ ప్రభుత్వంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడప నాగరాజు, పసుపులేటి రాము, తోట రవి, టీడీపీ నాయకులు పెద్దిన సత్యనారాయణ, కాసన్నేని వెంకట్రావు, దాసరి చంద్రం, పెట్టిన చంద్రశేఖర్, పిన్నమనేని సురేష్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గద్దె దింపాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వినాయకనగర్‌లో జనసేన నేతలు బలరాం, కిషోర్‌సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పేద, బడుగుల పార్టీ కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి


సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ

చింతలపూడి, మార్చి 10: పేద, బడుగుల పార్టీ కాంగ్రెస్ అని, కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని ఘంటశాల పద్మశ్రీ అన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పునజ్జీవం కోసం వైఎస్.షర్మిల బాధ్యతలు స్వీకరించారని, పలు రాజకీయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, మండల అధ్యక్షుడు విస్సంపల్లి సుందరరావు, కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య, పలువురు నేతలు పాల్గొన్నారు. సమావేశానికి భారీగా మహిళలు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఎస్పీకి మద్దతు ఇవ్వండి

ఏలూరు టూటౌన్, మార్చి 10: రాబోయే ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీకి మద్దతు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షురాలు పి.పరంజ్యోతి అన్నారు. నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. పరంజ్యోతి మాట్లాడుతూ కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15న విజయవాడ మున్సిపల్ మైదానంలో బహుజన భేరి నిర్వహిస్తున్నామని, సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్‌బాబు, రత్నాకర్, కే.రాజ్‌కుమార్, రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

హిందువులు సేవా దృక్పథంతో పని చేయాలి

కొయ్యలగూడెం, మార్చి 10: హిందువులంతా సేవా దృక్పథంతో పని చేయాలని కృష్ణ శరణానంద భారతి స్వామి అన్నారు. బయ్యన్నగూడెం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పూర్ణాహుతి కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ హిందువులలో చైతన్యానికి నిదర్శనమన్నారు. ప్రముఖ సినీ గేయరచయిత అనంతశ్రీరామ్, జి.సత్యనారాయణ, ప్రసాద్, బాబురావు, బొల్లిన నిర్మల, వేదుల జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా పులి శ్రీరాములు


పులి శ్రీరాములు

ఏలూరు రూరల్, మార్చి 10: కాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పులి శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులో కాపు ప్రముఖుల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీల ఎంపిక బాధ్యత పులి శ్రీరాములకు అప్పగిస్తూ తీర్మానించారు. శ్రీరాములు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన కూటమి విజయానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, పూజారి నిరంజన్, వాకా రాజు, తన్నీరు బుజ్జి, వంగల శివ, టి.రాంబాబు, శేషగిరి, బడే సతీష్, శ్రీదేవి, కె.మురళీకృష్ణ, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగకుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, మార్చి 10: సీనియర్ జర్నలిస్ట్ లంకా వెంకట నాగ కుమార్ కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. మాజీ సర్పంచ్ మండవల్లి సోంబాబు నాగకుమార్ భార్య పద్మజకు రూ.43,800 నగదు అందించారు. ఐజేయూ సభ్యుడు వాసా సత్యనారాయణ, కంచర్ల రవి, సీనియర్ జర్నలిస్ట్ నాగసూరి బాల సుబ్రహ్మణ్యం, రామకృష్ణయ్య, మనోహర్, ఫణి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ఏలూరు క్రైం, మార్చి 10: వేసవిలో పాదచారులకు దాహార్తి తీర్చడానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీవీ.కృష్ణారెడ్డి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఎన్ఆర్‌పేటలోని ఓవర్ బ్రిడ్జి పక్కన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కేవీ.రావు, బీవీవీ.సత్యనారాయణ, డి.రమాదేవి, డి.పద్మజావాణి పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం

పెదవేగి, మార్చి 10: గ్రంథ పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు. గ్రంథపఠనంతో కలిగే లాభాలను అరుణ్‌కుమార్ వివరించారు. నిత్యం గ్రంథ పఠనంతో మంచి విజ్ఞానవేత్తగా ఎదుగుతారన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథ పఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నత దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

టీడీపీ నేత వినోద్‌కు గుండెపోటు

పోలవరం, మార్చి 10 : టీడీపీ ఎస్సీ విభాగం మండల కార్యదర్శి యడ్ల వినోద్ ఆదివారం గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం పార్టీ మండల సమావేశానికి బయల్దేరుతుండగా హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. టీడీపీ మండల అధ్యక్షులు బొద్దు కృష్ణ, మంగిన కొండ, నాయకులు అతడిని 108 వాహనంలో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులుకు సీటు ఇవ్వలేదని వినోద్ ముభావంగా ఉన్నారని ఉదయం గుండెపోటుకి గురి కావడంతో ఆస్పత్రికి తరలించామని, చికిత్స పొందుతున్నారని నేతలు తెలిపారు.

సిద్ధం ప్రత్యక్షప్రసారం వద్ద జనం లేరు

ద్వారకాతిరుమల, మార్చి10: సీఎం జగన్ నిర్వహించే సిద్ధం భారీ బహిరంగ సభను లైవ్‌లో చూపుతామంటూ సోషల్ మీడియాలో ఊదరగొట్టినా చూసే జనం కరువయ్యారు. ద్వారకాతిరుమలలో ఒక కూడలిలో టెంట్ వేసి మండల ప్రజలు, నాయకులు కార్యకర్తలు రావాలని ఆర్భాటం చేశారు. సభ ప్రత్యక్ష ప్రసారం చూడమని ఏకరవు పెట్టారు. కొద్దిపాటి జనం మినహా ఎవరూ ఆ ప్రసారాన్ని చూసేందుకు ఆసక్తి చూపలేదు.

తొలి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే


పూలే విగ్రహం నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు రూరల్, మార్చి 10: తొలి మహిళా టీచర్ సావిత్రిభాయ్‌పూలే వర్ధంతి సందర్భంగా జడ్పీ కార్యాలయం వద్ద విగ్రహానికి జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తదితరులు పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే ఎంతో మందికి విద్యాదానం చేశారని, బాలికలకు ఒక పాఠశాల ప్రారంభించి జీవితంలో చదువు ఎదగడానికి కృషిచేశారని, తన జీవితాన్ని మహిళా అభ్యున్నతి కోసం కృషిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు, పామర్తి అచ్యుత్‌గౌడ్, లక్కోజు గోపి తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సమాజానికి సావిత్రీబాయి పూలే సేవలు ఆదర్శనీయమని రావికంపాడు తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వద్ద పూలే వర్ధంతిని అధ్యాపకులు, విద్యార్థులు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో బంద్ నిర్వహిస్తున్న గిరిజన సంఘాలు

ఏజెన్సీ బంద్ విజయవంతం

బుట్టాయగూడెం, మార్చి 10: ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, జీవో నెంబరు 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. ఆందోళనకారులు దుకాణాలు మూయించి వేశారు. వాహనాలు తిరగకపోవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో ఆందోళన అనంతరం నాయకులు, గిరిజనులు బస్టాండ్ సెంటరులో రాస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. అనంతరం సంఘం జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, సీఐటీయూ నాయకురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ ప్రత్యేక డీఎస్సీపై గిరిజన యువత ఎన్నో ఆశలతో ఎదురుచూస్తుంటే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా ప్రభుత్వం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టంలో సవరణలను కేంద్రం తీసుకువచ్చి అడవులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి పన్నాగాలు పన్నుతుందన్నారు. సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలో 7 ఉద్యోగాలు మాత్రమే గిరిజనులకు ఉండగా మిగిలిన ఉద్యోగాలన్నీ గిరిజనేతరులకు అవకాశం కల్పించే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రత్యేక డిఎస్సీని ప్రకటించి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: గిరిజనులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏపీ గిరిజన సంఘ జిల్లా నాయకుడు తెల్లం దుర్గారావు అన్నారు. జీలుగుమిల్లిలో బంద్ నిర్వహించి దుకాణాలు మూసి వేయించారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన, నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేశారు. గుండె గంగరాజు, ఎన్‌వి.అప్పారావు, చిట్టిబొమ్మ కొండలరావు నల్ల భీమశంకరం కారం మల్లుదొర చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్ శాంతియుతంగా జరిగింది. ప్రజా సంఘాల నాయకులు వర్తక వాణిజ్య వ్యాపార సంస్థలను మూయించి బంద్ నిర్వహించారు. అనంతరం ఏటిగట్టు సెంటర్‌లో నినాదాలు చేశారు. బొరగం భూచంద్రం, సముద్రాల సాయికృష్ణ, తామా బాలరాజు, గోకూరి పాండవులు, మిడియం గంగాదేవి, కొత్తెం రాజు, తాతి రామలక్ష్మి, కొమరం బుల్లబ్బాయ్ పాల్గొన్నారు.

● కుక్కునూరు: మన్యం ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నిర్వహించి, స్థానిక గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శి శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బంద్ పిలుపులో భాగంగా మండలంలో దుకాణాలు మూసివేశారు. బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలిపింది. యర్రంశెట్టి నాగేంద్రరావు, పట్ల చినలక్ష్మయ్య, వర్స పుల్లారావు, సవలం అర్జున్, కారం బుచ్చయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 10 : సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత గ్రామమైన వైఎస్సార్ కాలనీలో వారం రోజుల ప్రత్యేక శిబిరం ఆదివారం ప్రారంభమైంది. కోఆర్డినేటర్ శ్రీలత మాట్లాడుతూ ఉచిత దంత వైద్య శిబిరం, జనరల్‌బాడీ చెకప్, పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్, సహజ వనరుల వినియోగం, నేత్రవైద్య శిబిరం, ఇంధన పొదుపు తదితర అంశాలపై అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థినులను సమాజ సేవపై ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు హెచ్‌వోడి కె.రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.బ్యూలా స్వరూప, కె.అరుణ, పి.పూజిత, పి.విజయలక్ష్మి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి, వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు


సమావేశమైన ఆదివాసీ నాయకులు

కుక్కునూరు, మార్చి 10: వాల్మీకి, వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అన్నారు. కుక్కునూరులో పలు ఆదివాసీ సంఘాల నాయకులు కూరం సంజీవరావు అధ్యక్షతన ఆదివారం సమావేశమయ్యారు. బీసీ కులాలను ఎస్టీలో కలపవద్దని శ్రీకాకుళం (పాతపట్నం)లో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వబయోగి, జిల్లా నాయకులు సింహాచలం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారన్నారు. వారికి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కులపై రాష్ట ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సరియం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పైదా పరమేష్, కోశాధికారిగా వెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కోవసి నాగర్జునను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం సత్యనారాయణ, కుంజా రమేష్, నాయకులు బిట్ల శివలింగయ్య, కుంజ నర్సింహారావు, వెంకట నర్సయ్య, అశోక్, బసవరాజు, కొమరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాపీ పనివారల సంఘ కార్యవర్గం ఎంపిక

భీమడోలు, మార్చి 10 : సంత మార్కెట్‌లోని గ్రామదేవతల ఆలయ ఆవారణలో ఆదివారం భీమడోలు అయ్యప్ప తాపీ పనివారల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా వి సీతారామయ్య, అధ్యక్షులు కేతినీడి సోమరాజు, సంయుక్త కార్యదర్శి షేక్ నాగూర్, కార్యదర్శి ఈతకోట సూర్యనారాయణ, ట్రెజరర్ వీరరాఘవ, సభ్యులు రాము, ఫణికుమార్, శివ, నరేష్, నాని, రాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

కుక్కునూరు, మార్చి 10: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. సర్పంచ్ రావుమీనా వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ఆరంభించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, అటెండర్ మురళిని సత్కరించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, మాదినేని శ్రీనివాస్, నిర్మల సంతోష్, రావు వినోద్, కుక్కునూరు మురళి, రావు శ్రీనివాసరావు, రవి, నారాయణరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** సత్రంపాడులో ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన ధానభాస్కరరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీకృష్ణదేవరాయులు, సీహెచ్ గణపతి, బొర్రా శివ, క్రీడాకారులు పాల్గొన్నారు.
- **చింతలపూడి :** సీతానగరంలో గుమ్మడపు గోపిప్రసాద్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ రాజాబాబు ఆధ్వర్యంలో పోటీలను పొన్నాల అనిత, కె.విజయరాజు ప్రారంభించారు. సర్పంచ్ గాయం మల్లేశ్వరి, జడ్పీటీసీ నీరజ, ఎంపీపీ రాంబాబు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.
- **కుక్కునూరు :** పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారుల లైసెన్సు, వాహన పత్రాలు పరిశీలించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** నారాయణపురంలో చేబ్రోలు లయన్స్, దాట్ల గంగాధర రాజు సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు, అడపా శోభారాణి పాల్గొన్నారు. వైద్యులు దాట్ల దివ్య సరోజ, షాజియా సుల్తానా, ఎం.సింహాచలం, ఎస్.శివరామిరెడ్డి, పి.సతీష్‌కుమార్ రాజు రోగులను పరీక్షించారు.
- ఉంగుటూరు మండలం కైకరం పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- **భీమడోలు :** సూరప్పగూడెం సాల్వేషన్ ఆర్మీచర్చిలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పాస్టర్ భూపతి అధ్యక్షతన మండే సుధాకర్ ఆధ్వర్యంలో బోణా ఆదినారాయణ ఆర్థిక సహాయంతో 20 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు.



భైరవపట్నంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

» కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్

మండవల్లి, మార్చి10: రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. ఆదివారం మండవల్లి మండలం కానుకొల్లు, ఉనికిలి, భైరవపట్నం గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ఆయా గ్రామాల్లో కవాతు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వారికి కావాల్సిన పార్టీకి వేసుకోవాలన్నారు. ఎవరైనా భంగం కలిగిస్తే చట్టరీత్యా నేరమని, ఎన్నికల్లో ప్రలోభాలాకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండవల్లి ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సులు లేకపోవడంతో ఏలూరులో కూర్చొన్న ప్రయాణికులు

ఇదేం ఖర్మ !

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు

ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన ప్రయాణికులు

మండుటెండలో బస్టాండ్లు,రోడ్లపై అవస్థలు

వైసీపీ ప్రచార సభలు ఆర్టీసీ ప్రయాణికులతో పాటు విద్యాసంస్థల యాజ మాన్యాలకు తలనొప్పిగా మారుతున్నాయి. ఎక్కడ సభ జరిగినా చుట్టు పక్కల జిల్లాల ఆర్టీసీ బస్సులను, విద్యాసంస్థల బస్సులను జనాన్ని తరలించటానికి తీసుకు వెళుతూండటంతో ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఇదెక్కడి ఖర్మరా బాబు అంటూనే ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణాలు చేశారు.

భీమవరం టౌన్, మార్చి 10 : పకాశం జిల్లా మేదరమెట్లలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు వెళ్ళటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. భీమవరం, తణుకు డిపోల నుంచి 28 బస్సుల చొప్పున, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల నుంచి 22 బస్సుల చొప్పున పంపించారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగా రెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 80 బస్సులను తరలించారు. భీమవరం డిపోకు సబంధించి 28 బస్సులు పంపించడంతో ఆదివారం జయవాడ, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం వెళ్లే పలు సర్వీసులను రద్దుచేశారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్ కాంప్లెక్స్‌కు చేరుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్సులు లేక జనం పాట్లు

ఏలూరు రూరల్ : ఆదివారం ఏలూరు ఆర్టీసీ బస్టాండులో బస్సులకోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఆదివారం ఉదయం నుంచే సిద్ధం సభకు బస్సులను పంపించారు. డ్రైవర్లు సిద్ధం సభకు వెళ్ళేందుకు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మూడు రోజుల పాటు శైవక్షేత్రాలకు తిరిగి కొద్దిపాటి విశ్రాంతితో బస్సులు నడుపుతుంటే ఇప్పుడు సిద్ధం సభకు ఒకరోజు విదులు పొడిగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి బస్సుల కొరతతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నరసాపురం బస్టాండ్‌లో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పవిత్ర ప్రార్థనలకు వేళాయె

రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

రంజాన్ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ముస్లింలకు ఈ మాసం ఎంతో పవిత్రమైంది. ఈ మాసంలో చేసే ప్రతీ ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రెట్లు ఫలితాలను అందిస్తుందని ముస్లింల విశ్వాసం. నెల రోజులపాటు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు నిర్వహిస్తారు. భగవత్ ఆశీస్సులు అందించే ఈ పవిత్ర రంజాన్ కోసం ముస్లింలు సంవత్సరమంతా ఎదురుచూస్తుం టారు. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెల పొడుపు కనిపించగానే ఈ ఏడాది రంజాన్ మాసం ప్రారంభమవుతుందని మంగళవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

\- ముదినేపల్లి



నమాజ్‌కు ప్రాధాన్యం

ప్రతీరోజూ ఉపవాస దీక్షలు పాటించే ముస్లింలు నమాజ్‌కు ప్రథమ ప్రాధాన్యతనిస్తారు. రంజాన్ మాసం అంతా నమాజ్‌కు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. సూర్యోదయానికి ముందు (సహర్) నుంచి సూర్యాస్తమయం (ఇఫ్తార్) వరకు ఉపవాస దీక్షలు పాటిస్తారు. రోజూ ఐదు పూటలు నమాజ్ చేయడం రంజాన్ మాస ప్రత్యేకత. దీనికి అదనంగా రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు సాగే 'తరావీహ్' నమాజ్‌తో ఖురాన్ పఠనం చేస్తారు.

ధానధర్మాలకు ప్రాధాన్యం

రంజాన్ మాసాన్ని భూమిపై దివ్య ఖురాన్ అవతరించిన మాసంగా ముస్లింలు భావిస్తారు. ఈ మాసంలో 'సఫిల్' చదివితే 'ఫరజ్' చదివినంతగా అంటే 70 సార్లు నమాజ్ చేసిన పుణ్యం వస్తుందన్నది ఇస్లాం గ్రంథాలు ప్రబోధిస్తున్నాయి. ఈ మాసంలో ధానధర్మాలకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రతీ ముస్లిం నిర్ణీత దానం తప్పనిసరిగా చేయాలని, ఇది ఎన్నో రెట్లు ఫలితాలను అందిస్తాయన్నది విశ్వాసం

హలీంకు ప్రత్యేకత

రంజాన్ మాసంలో ముస్లింలకు రుచికరమైన వంటకం హలీం. గతంలో హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వంటకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. పలు ప్రాంతాల్లో రంజాన్ స్పెషల్ హలీం విక్రయాలకు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. హలీం వల్ల శరీరం బలంగా తయారవుతుందన్నది ముస్లింల నమ్మకం.

రంజాన్ మాసం ముగింపు

రంజాన్ మాసం ఏప్రిల్ తొమ్మిదో తేదీ సాయంత్రం ముగుస్తుంది. మరుసటి రోజు ఈద్-అల్ - ఫితర్ వేడుకతో ఉపవాస కాలం ముగుస్తుందని మత పెద్దలు చెబుతున్నారు. మహ్మద్ ప్రవక్త రూపొందించిన ఖురాన్ పఠనం ముస్లింలకు స్వీయ క్రమశిక్షణ, ఆధ్యాత్మిక వృద్ధికి దోహదం చేయటం రంజాన్ మాసానికి ప్రతీకగా చెబుతుంటారు.





లోపూడిలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు, ప్రత్తిపాడు పాదయాత్రలో టీడీపీ నేత కొడాలి వినోద్, శ్యామలాంబపురంలో జనసేన నేత కొల్లి వరప్రసాద్

టీడీపీ 'సూపర్ సిక్స్'తో అన్నివర్గాలకు లబ్ధి

ముసునూరు, మార్చి 10: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ నాయకుడు లక్కపాము కాంతరావు అన్నారు. ఆదివారం లోపూడిలో 68వ బూత్ పరిధిలోని ప్రజలకు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను టీడీపీ నాయకులు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సం యుక్త ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిని గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. నాయకులు నక్కా రామారావు, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, నరసింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు టీడీపీ ధర్మపోరాట పాదయాత్ర

మండవల్లి, మార్చి10 : జగన్‌రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లోకి మూడోరోజు ఆదివారం ధర్మపోరాట పాదయాత్ర కొనసాగింది. తెలుగుదేశం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో లోకుమూడి నుంచి చావలిపాడు మీదుగా భైరవపట్నం, ప్రత్తిపాడు, తక్కెళ్ళపాడు, ఆనందాపురం, మూడుతాళ్ళపాడు, మండవల్లి మీదుగా పెరికెగూడెం గ్రామానికి ఆదివారం పాదయాత్రగా చేరారు. పలువురు టీడీపీ శ్రేణులు కొడాలి వినోద్‌ను కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, మండవల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పళ్ళెం ఏడుకొండలు, టీడీపీ క్లస్టర్ కూనపరెడ్డి కోటేశ్వరరావు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి పంతగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : కొల్లి

కైకలూరు, మార్చి10: ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై పెద్దఎత్తున వ్యతిరేకత ఉందని రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని జనసేన పార్టీ నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. ఆదివారం శ్యామలాంబపురంలో 'జనంలోనికి జనసేన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జనసేన ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మూడు పార్టీల కూటమిని ఆదరించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. జనసేన పార్టీ గ్రామ నాయకుడు తిరుమని వడ్డికాసులు, తిరుమని ఏసురాజు, పార్టీ నాయకులు ఉప్పాల సూర్యప్రకాశరావు, తిరుమాని నాగభూషణం, బోడావుల రాజా, నవీన్‌కుమార్, కడవకల్లు నరసింహ, తోట సంజయ్, తులసి శివ, తోట కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం : కామినేని



మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

కలిదిండి, మార్చి 10 : టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో వైసీపీ ఓటమి ఖాయమని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సానారుద్ర వరం, ఎస్.ఆర్పీ అగ్రహారం గ్రామాల్లో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. సచివాలయం సహా తాకట్టు పెట్టి అప్పుల ఆంధ్రగా చేసిన సీఎం జగన్‌ను సాగనంపాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, బలే ఏసురాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబి, వలవల రమేష్, బీజేపీ నాయకులు శివశంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు సమావేశానికి తరలిన జనసైనికులు

చాట్రాయి, మార్చి 10: నూజివీడు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి, జనసేన నియోజ వర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో నూజివీడులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జనసేన ఆత్మీయ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల జనసైనికులు తరలివెళ్ళారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ మెజారిటీ సాధించి అధికారంలోకి రావడం తధ్యమని జనసైనికులు ధీమా వ్యక్తంచేశారు. జనసేన నాయకులు తుమ్మల జగన్, తగరం సురేష్, మలుగుమాటి భాస్కరరావు, సవిరి దుర్గాప్రసాద్, సవరం రామారావు, సుమన్, గోపీకృష్ణ, శ్రీరాముల సత్యనారాయణ, వెల్లంకి శ్రీమన్నారాయణ, తిరుపతిరావు, పలు గ్రామాల నాయకులు నూజివీడు ఆత్మీయ సమావేశానికి తరలి వెళ్లారు.



నూజివీడు సమావేశంలో పార్థసారథితో చాట్రాయి జనసైనికులు

● నూజివీడు, మార్చి 10: ప్రాంతాలు చూడం, మతాలు చూడం, రాజకీయాలు చూడమని చెప్పిన వైసీపీ పాలనలోనే వివక్ష అధికమని నూజివీడు టీడీపీ కూట మి అభ్యర్థి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మొర్సపూడి, సుంకొల్లు గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్లినా గుంతల రహదారులు తప్ప అభివృద్ధి అనేది కానరావడం లేద న్నారు. కనీసం ఐదేళ్లలో గోతులను కూడా పూడ్చలేని స్థానిక ఎమ్మెల్యే. ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



భక్తుల అమావాస్య స్నానాలు

శివలింగం వద్ద పూజలు

ముగిసిన బలివే ఉత్సవాలు

» అమావాస్య స్నానాలకు పోటెత్తిన భక్తులు

ముసునూరు, మార్చి 10: బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు స్వామివారి పవళింపుసేవతో వైభవంగా ముగిశాయి. ఆదివారం అమావాస్య కావడంతో పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో భక్తులు నిలబడి స్వామిని దర్శించుకున్నారు. బహ్మ శివలింగం, నాగేంద్రస్వామి పుట్టవద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ఉదయం బిందె తీర్థం, బలిహరణ, వసంతోత్సవం, గ్రామోత్సవం, అవభృతం, సాయంత్రం హోమము, బలిహరణాదులు, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి అరుణభాస్కరరావు ఆధ్వర్యంలో రాత్రి రామలింగేశ్వర స్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకరణ చేశారు, పలు రకాల పుష్పాలతో ఉయ్యాలను అలంకరించి, మంగళహారతులతో గీతాలు ఆలపించి స్వామివారి పవళింపుసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో నల్లూరి సతీష్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి భక్తులకు కావాల్సిన అసౌకర్యాలను పర్యవేక్షించారు. సోమవారం ఉదయం పది గంటల నుంచి స్వామివారి ఉత్సవాల హుండీల లెక్కింపు జరుగుతుందని ఈవో తెలిపారు.

ముగిసిన భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయిస్తున్న ఈవో శింగనపల్లి దంపతులు

కలిదిండి, మార్చి 10 : కలిదిండిలో ఐదు రోజులుగా జరుగుతున్న పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు కోనేరులో త్రిశూల స్నానం చేయించారు. అనంతరం ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామి, అమ్మవారి పవళింపు సేవ నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలకు సహకరించిన వారందరికీ ఈవో కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తామని ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనాలన్నారు.

మరోసారి మోసపోవద్దు : మాజీ ఎమ్మెల్యే చిన్నం



మాట్లాడుతున్న చిన్నం రామకోటయ్య

నూజివీడు, మార్చి 10:అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా రహదారుల్లో గుంతలు పూడ్చలేని వైసీపీ ప్రభుత్వం.. కొద్దిరోజుల నుంచి హడావుడిగా రోజుకు ఐదు, ఆరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనల సాగించడం మరోసారి ప్రజలను మోసగించడమేనని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య విమర్శించారు. ఆదివారం నూజివీడులోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లీజ్ ఒక్కసారి చాన్స్ ఇవ్వండి అంటూ ప్రజలను మోసగించిన అధికారపార్టీ, రివర్స్‌పేరుతో రాష్ట్రాన్ని 20 ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళిందన్నారు. చివరకు సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టారంటే ఇది రాష్ట్రప్రభుత్వం దివాళాకోరుతనాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. టీడీపీ -బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడటం హర్షణీయమన్నారు.

సావిత్రిబాయి పూలేకి నివాళులు



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు

మండవల్లి, మార్చి 10: మహిళల సకల హక్కుల కోసం పోరాడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియే షన్ మండవల్లి గౌరవ అధ్యక్షుడు కొరపాటి శాంతరాజు అన్నారు. మండవల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో ఆదివారం సావిత్రిబాయి 127వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక మండల అధ్యక్షుడు టి.అప్పారావు, అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి రవివరప్రసాద్, పొట్టిప్రోలు సుధీర్, గోరింక గాంధీ, అనిల్‌కుమార్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూతగా 'మానవత సంస్థ'

ఆగిరిపల్లి, మార్చి 10: జాతి, కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా సంస్థలో సభ్యులందరూ కలిసి పేదలకు తమవంతు సహకారం అందించే సదుద్దేశంతో ఏర్పడిన సంస్థే మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అని సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షీణిస్తున్న మానవ విలువలను పరిరక్షించి, శాంతి సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తనవంతు కృషిచేయాలన్నారు. సంస్థ ముఖ్య ఉద్దేశాలైన పర్యావరణ పరిరక్షణ, బ్లడ్ బ్యాంక్, అంబులెన్స్‌లు, విద్యార్థులకు ఆర్థిక సాయం, ఉచిత వితరణ వంటి సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతుందన్నారు. ఆగిరిపల్లిలో కూడా తమ సంస్థకు సంబంధించిన ఒక విభాగం ఏర్పాటుచేసి సంస్థ ఆశయాలు ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు.

మహిళల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు



చేయూత చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే డీఎన్ఆర్, ఎమ్మెల్సీ వెంకటరమణ

కైకలూరు,మార్చి10: మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకాన్ని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఆయన అందించారు. ఎంపీపీ అడవి వెంకటకృష్ణమోహన్, జడ్పీటీసీ కురెళ్ల బేబి, ఏఎంసీ ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ డీఎన్ నవరత్నకుమారి, ఏపీఎం పి. సత్యనారాయణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● నూజివీడు, మార్చి 10 : నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని నూజివీడు ఎమ్మెల్యే మేకావెంకటప్రతాప్ అప్పారావు లాంఛనంగా ఆదివారం అందించారు. నూజివీడు మండల, మున్సిపల్ పరిధిలో 7,317మంది లబ్ధిదారులకు రూ.13.72 కోట్లకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూజివీడు మునిసిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ వైస్‌ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఏపీఎం దయాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.




ఉప్పరగూడెం వద్ద చెట్లతో మూసుకుపోయిన రోడ్డు మలుపు, మలుపులో బోల్తాపడిన లోడు లారీ (ఫైల్)

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

ముదినేపల్లి, మార్చి 10 : ముదినేపల్లి-బంటుమిల్లి ప్రధాన రహదారిలో ఉప్పరగూడెం గ్రామం వద్ద రోడ్డు మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. మలుపుల్లో ఇరువైపులా ముళ్లపొదలు, చెట్లు పెరిగిపోవడంతో ఒక వైపు నుంచి వచ్చే వారికి మరోవైపు నుంచి వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఎదురుగా వస్తున్న వాహనాలను ఆకస్మాత్తుగా తప్పించబోయి పలు భారీ వాహనాలు, ట్రాక్టర్లు బోల్తా పడిన ఘటనలు అనేకం జరిగాయి. ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఆర్అండ్‌బీ అధికారులు మలుపుల్లోని చెట్లను కొంతవరకు నరికించడం తప్ప పూర్తిగా తొలగించడం లేదు. మళ్లీ కొద్ది రోజుల్లోనే చెట్లు దట్టంగా పెరిగి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. ముదినేపల్లి వైపు మలుపులో రోడ్డు పెదలంక డ్రెయిన్ నీటి కోతకు గురికావడం మరింత ప్రమాదకరంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు పూర్తిగా చెట్లను తొలగించాలని ఉప్పరగూడెం గ్రామస్థులు కోరుతున్నారు.

గురజ రోడ్డు కూడలి ధ్వంసం..

ముదినేపల్లి-సింగరాయిపాలెం ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిలో గురజ రోడ్డు ముఖ్యకూడలి ప్రమాదకరంగా తయారైంది. రోడ్డు మార్జిన్‌తోపాటు గుడ్లవల్లేరు వైపు వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. గుడివాడ - బంటుమిల్లి, గుడ్లవల్లేరు వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రధాన కూడలి కావడం భారీ వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు గోతులమయం అయింది. కళాశాలలకు, ఆసుపత్రులకు, పాఠశాలలకు వెళ్లే వారితోపాటు వ్యాపార సంస్థలకు పలు వాహనాల్లో వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని ఈ కూడలి ప్రదేశాన్ని బాగు చేయించాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా తలపై పడి బాలిక మృతి

» వీరంపాలెం శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి



పుష్ప (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 10:తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి బాణసంచా కాల్పుల్లో భాగంగా తారాజువ్వ బాలిక తలపై పడి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన దాస రి పుష్ప తన స్నేహితురాలితో కలిసి శివరాత్రి ఉత్సవాల ఊరేగింపు తిలకించేందుకు వచ్చింది. ఊరేగింపులో భాగంగా బాణ సంచా కాలుస్తుండగా టపాసు విపలమై బాలిక తలపై పడింది. దీంతో పుష్ప తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరి మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఊటుకూరు రోడ్డులో గోతులు పూడ్చండి

ముదినేపల్లి రూరల్, మార్చి 10: మండలంలోని మల్లపురాజుగూడెం నుంచి ఊటుకూరు వెళ్లే ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి నిర్మాణం చేపట్టి 15 ఏళ్లు కావస్తున్నా నేటికీ పునఃనిర్మాణం చేయలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రహదారి గోతులు సైతం పూడ్చడానికి నిధులు మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో రహదారిపై ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నామని ద్విచక్రవాహన దారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వెంగళరావు

కైకలూరు, మార్చి10: అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా ఆచవరం గ్రామానికి చెందిన బూరుబోయిన శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు నియామకపు పత్రాన్ని అందచేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యాదవ మహాసభకు సహాయసహకారాలను అందిస్తుస్తానని, హక్కులు, సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. భారతీయ యాదవ మహాసభ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్, టీటీడీ సభ్యుడు నెలుసు నాగసత్యం తదితరులు పాల్గొన్నారు.

'అమావాస్య ధ్యానంతో శక్తి పెంపు'

ఆగిరిపల్లి, మార్చి 10: అమావాస్య ధ్యానం వల్ల మానవుడిలో శక్తి మూడింతలు పెరుగుతుందని ఆగిరిపల్లి గరికపాటి పిరమిడ్ మాస్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత, చురుకుదనం కలుగుతాయని తెలిపారు. ఆగిరిపల్లి గరికపాటి పిరమిడ్ ధ్యాన మందిరంలో యోగాక్లాసులు జరుగుతున్నాయని, భారతప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ప్రభుత్వహోమియో వైద్యశాలలో స్థలాభావం వల్ల ఫిరమిడ్ ధ్యానమందిరంలో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. యోగా గురువులుగా కుమార్, జ్యోతి వ్యవహరిస్తున్నారని తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నూజివీడు టౌన్, మార్చి 10: నూజివీడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్‌అప్పారావు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. మండలపరిధిలోని అన్నవరం, ఓగిరాలతండా, కొత్తూరుతండా, యనమదల,బత్తులవారిగూడెం గ్రామాల్లో జలజీవన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయిలను వేసే పథకాలకు ఆయన లాంఛనంగా శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.